ప్రజాశక్తి
శుక్రవారం 27 డిసెంబర్ 2024







సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

కరువు బృందం పర్యటనకు ..

పూర్తి స్థాయి ఏర్పాట్లు

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రకటించిన కరువు మండలాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించేందుకు జనవరి 2, 3వ తేదీల్లో జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటిస్తోందని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధికారులను సూచించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కేంద్ర కరువు బృందం పర్యటనకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2024 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 7 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఈ మండలాల్లో కరువు సమయంలో పరిస్థితిని అంచనా వేయడానికి ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించనుందని తెలిపారు. ఈ పర్యటన నేపథ్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కేంద్ర బందం పర్యటన నేపథ్యంలో వసతి, వాహనాలు ఏర్పాటు, నోట్స్ సిద్ధం చేయాలన్నారు. ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కరువును తెలియజేయాలన్నారు. వర్షపాతం, పంట నష్టం తదితర అన్ని రకాల వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కరువు మండలాల్లో తాగునీటి సమస్యలు ఉంటే వారికి చూపించాలన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్ర బందం పర్యటనను విజయవంతం ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ ఎ.మాలోల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, సిపిఒ అశోక్ కుమార్, డ్వామా పీడీ సలీం బాషా, ఏపీఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, హార్టికల్చర్ డిడి నరసింహారావు, డిపిఎం ఆనంద్, ఐసిడిఎస్ పీడీ వనజ అక్కమ్మతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ సర్వేను వేగవంతం చేయండి

జిల్లాలో ఎంఎస్ఎంఇ యూనిట్ల సర్వేను వేగవంతం చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఎంఎస్ఎంఇ యూనిట్ల సర్వే, పిఎసిఎస్ సభ్యుల ఈకేవైసీ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిఎల్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 89,500 ఎంఎస్ఎంఇలు ఉంటే 14 వేల ఎంఎస్ఎంఇలు సర్వే పూర్తయ్యిందన్నారు. ఇప్పటివరకు 18 శాతం మాత్రమే సర్వే పూర్తి అయ్యిందన్నారు. దీనిని వేగవంతం చేసి వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. బ్యాంకుల రుణం, ఇతర విషయాలను ఎంఎస్ఎంఇ యజమానులకు తెలియజేసి సర్వే పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, డిసిఒ అరుణకుమారి పాల్గొన్నారు.

శింగనమల ఫ్యాన్‌లో అయోమయం..!

◆ శైలజానాథ్ ఆ పార్టీలోకి వెళ్తారంటూ ప్రచారం

◆ ఇదేజరిగితే సాంబశివారెడ్డి దారెటు..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల నియోజకవర్గం వైసిపిలో అయోమయం నెలకొంటోంది. ఆ నియోజకవర్గంలో ఇప్పటికే అధికార టిడిపిలో కుంపట్లు నడుస్తున్నాయి. అదే పరిస్థితి ప్రతిపక్ష వైసిపిలోనూ నెలకొంటోంది. మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త అలూరు సాంబశివారెడ్డి శింగనమల వైసిపి రాజకీయ వ్యవహారాలు చక్కబెట్టేవారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వారిని తప్పించారు. వారు సూచించిన వ్యక్తి టిప్పర్ డ్రైవర్ వీరాంజినేయులుకు గత ఎన్నికల్లో టిక్కెట్టు ఇచ్చారు. ఆయన టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ చేతిలో ఓటమి చెందారు. ఆ తరువాత ఆయన కనిపించలేదు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను ఆలూరు సాంబశివారెడ్డి ఇప్పుడు చూస్తున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన వీరాంజినేయులు తిరిగి పాత వృత్తిలోకి వెళ్లినట్టు నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది. ఆయన ఇటీవల పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన సమీక్షకు వెళ్లలేకపోయారు. ఇదే సమయంలో మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని కర్నూలు జిల్లాలో జరిగిన ఓ పెళ్లిలో కలవడం చర్చనీయాంశం అయ్యింది. ఎన్నికలకు ముందే శైలజానాథ్ కాంగ్రెస్ పార్టీని వీడి టిడిపిలో చేరుతున్నట్టు ప్రచారం నడిచింది. ఇది జరగలేదు. కాంగ్రెస్ పార్టీలోనే ఉండటమే కాకుండా ఆ పార్టీ తరుపున ఎన్నికల్లోనూ పోటీ చేశారు. ఆశించిన ఓట్లు ఏమీ పెద్దగా ఆయనకు రాలేదు. ఈ తరుణంలో ఇప్పుడు వైసిపి వైపు చూస్తున్నారనే ప్రచారం నడుస్తోంది. శైలజానాథ్ వైసిపిలో చేరితో శింగనమల నియోజకవర్గ బాధ్యతలు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అందుకు ఇద్దరు సీనియర్ నాయకులు కూడా మద్దతునిస్తున్నట్టు వైసిపిలో చర్చ నడుస్తోంది. ముందు నుంచి వైసిపిలో ఆలూరు సాంబశివారెడ్డిని వ్యతిరేకిస్తున్న నేతలున్నారు. కొన్ని సందర్భాల్లో అవి బాహాటంగానే బయటకొచ్చాయి. ఇప్పుడు శైలజనాథ్ వైసిపిలోకి వచ్చి శింగనమల బాధ్యతలిస్తే ఇక ఆలూరు సాంబశివారెడ్డికి నియోజకవర్గంలో రాజకీయ వ్యవహారాలు చూడటం కష్టసాధ్యమవుతుందన్న చర్చ నడుస్తోంది. శైలజనాథ్‌కు ముందు నుంచి శింగనమల నియోజక వర్గంపై పట్టుంది. అది కూడా గతంలో కాంగ్రెస్, ఇప్పుడు వైసిపి నేతలుగా నున్న అందరితోనూ సంబంధాలుండటంతో ఆయన నియోజకవర్గంపై పూర్తిస్థాయి పట్టు సాధించే అవకాశముంది. అప్పుడు ఆలూరు సాంబశివారెడ్డి పట్టుకోసం ప్రయత్నిస్తారా లేక పక్కకు తప్పుకుంటారా అన్నది చూడాల్సి ఉంది. ఈ ఇద్దరి మధ్య పట్టుకోసం ప్రయత్నాలు నడిస్తే గ్రూపులు ఫ్యాన్‌లో స్పష్టంగా నెలకొనే అవకాశాలు లేకపోలేదు. ఏది ఏమైనా శింగనమల నియోజకవర్గంలో అటు అధికార టిడిపి, ఇటు ప్రతిపక్ష వైసిపిలోనూ సొంత పార్టీలో కుంపట్లు వేడిని పుట్టించే విధంగా ఉంటున్నాయి.



ఇటీవల ఓ వివాహ కార్యక్రమంలో జగన్‌ను కలిసి మాట్లాడుతున్న శైలజానాథ్(ఫైల్‌ఫొటో)



రోడ్డును చూపుతున్న రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కురుగౌడ

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

రాష్ట్రంలో టిడిపితోనే అభివృద్ధి, ప్రజల సంక్షేమం సాధ్యమని రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కురుగౌడ తెలిపారు. మండలంలోని గుండిగానిపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్లను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడతూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో టిడిపి మండల కన్వీనర్ శ్రీరాములు ఆదేశాల మేరకు గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా రూ. 10 లక్షలతో 250 మీటర్ల సీసీ రోడ్లు మంజూరు చేశారన్నారు. నేటికి 150 మీటర్ల సీసీ రోడ్డును పూర్తి చేశామని, మిగిలిన వంద మీటర్లను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. సీసీ రోడ్డును నాణ్యతగా పూర్తి చేశామని తెలిపారు.

రేపు, ఎల్లుండి తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రాయదుర్గం

మండలంలోని టి.వీరాపురం అటవీ ప్రాంతంలో తాగునీటి పైపులైన్ మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 28, 29 తేదీల్లో పట్టణంలో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని మునిసిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడి పురపాలక సంఘంతో సహకరించాలని కమిషనర్ కోరారు.

విద్యుత్ భారాలపై నేడు వైసిపి నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-రాయదుర్గం

కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం వైసిపి ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ప్రదర్శన చేస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వినాయక కూడలిలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టి, అక్కడి నుంచి భారీ ర్యాలీగా విద్యుత్ సంస్థ కార్యాలయం వద్దకు వెళ్లి విద్యుత్ అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్‌కు వినతిపత్రం ఇస్తామని తెలిపారు. నిరసన ప్రదర్శన, ర్యాలీలో వైసిపి శ్రేణులు, రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శిథిలావస్థలో విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ఐదో వార్డు చాకలి వీధిలో ఓ విద్యుత్(ఇనుప) స్తంభం తుప్పు పట్టింది. ఈ స్తంభం ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసినప్పుడు స్తంభం నుంచి చిన్నపాటి విద్యుత్ షాక్ తగులుతుందని, వెంటనే విద్యుత్ శాఖ అధికారులు శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభం

మహాసభల విజయవంతం కోసం ప్రచారజాత



గుంతకల్లులో ప్రచార జాతాను ప్రారంభిస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప

ప్రజాశక్తి-గుంతకల్లు

కాకినాడలో జనవరి 5,6,7,8వ తేదీల్లో జరుగునున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రచార జీపుజాతాను చేపట్టారు. ఈజాతా గురువారం గుంతకల్లు నుంచి ప్రారంభం అయ్యింది. భగత్ సింగ్ పురపాలక ప్రాథమిక పాఠశాల నుంచి ప్రారంభం అయిన జాతాను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం మీదుగా జాతా వెళ్లి రాప్తాడులో ముగిస్తుంది. అనంతరం సత్యసాయి జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఈ సందర్భంగా కోటేశ్వరప్ప మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలను కలుపుతూ జాతా బృందం పర్యటిస్తుందని చెప్పారు. యుటిఎఫ్ నాయకులు, సభ్యులు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, దేవేంద్రమ్మ, రామప్ప చౌదరి, సరళ, శేఖర్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రచార జాత గురువారం ఉరవకొండకు చేరుకుంది.

గుంతకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం, రాప్తాడులో కొనసాగిన యుటిఎఫ్ జాత

ఉరవకొండ యుటిఎఫ్ నాయకులు జాతాకు స్వాగతం పలికారు. యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయం వద్ద రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ ఆ సంఘం జెండాను ఎగురవేశారు. కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ యుటిఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, సహాధ్యక్షులు రామప్ప చౌదరి, శేఖర్, లింగమయ్య, రాజశేఖర్, సరళ, మండల నాయకులు జయరాములు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : యుటిఎఫ్ ప్రచారజాత కార్యక్రమం గురువారం రాత్రి అనంతపురం చేరుకుంది. జాతాకు కళ్యాణదుర్గం రోడ్డు సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ, ప్రజారోగ్య వేదిక, విద్యాన్ విశ్వం విజ్ఞాన కేంద్రంతో పలు ప్రజా సంఘాలు స్వాగతం పలికాయి. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, కోటేశ్వరప్ప, అనంతపురం జిల్లా జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా కార్యదర్శులు సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు జిలాన్, నాయకులు కొండప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు. జాతాకు స్వాగతం పలికిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, శివానంద, మెడికల్ యూనియన్ నాయకులు పి.శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



వర్షం రావడంతో ధాన్యంపై కప్పిన కవర్లు

అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు తుంగభద్ర ఆయకట్టు కింద వరి పంట సాగు చేసి కోత కోసి కుప్ప చేసి ఆరుబయట కల్లాల్లో ఆరబెట్టారు. ఈ సమయంలో తుపాను ప్రభావంతో అకాల వర్షాలు కురవడంతో చేతికొచ్చిన ధాన్యం తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో ఓ తుపాను, పంట కోసిన తర్వాత మరో తుపాను ప్రభావంతో వర్షాలు కురవడంతో భారీ నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు బహిరంగ మార్కెట్‌లో గిట్టు బాటు ధర లేకపోవడం, మరోవైపు ప్రభుత్వ నిబంధనలతో ధాన్యం విక్రయించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

పింఛను లబ్ధిదారులపై సర్వే

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని కోనాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంలో భాగంగా వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ నడవలేని స్థితిలో ఉండి మంచానికే పరిమి తమైన వికలాంగుల పింఛను పొందుతున్న లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పరిశీలించారు. పింఛను సొమ్ము సక్రమంగా అందుతున్నదా లేదా అని ఆరా తీశారు. అలాగే బాల వికాసం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించారు. పౌష్టికాహారం నాణ్యతపై గర్భిణులు, బాలింతల ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఎల్‌హెచ్‌పి సల్మా, హెల్త్ అసిస్టెంట్ గోవిందరాజులు, సచివాలయ ఎఎన్ఎం నిర్మల, అంగన్వాడీ కార్యకర్తలు అంజనమ్మ, గుణమ్మ, ఆశా కార్యకర్తలు గీతాలక్ష్మి, తిప్పక్క, పాల్గొన్నారు.

వరిధాన్యం సేకరణ కొనసాగించండి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

జిల్లా వ్యాపంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన ధరతో సకాలంలో కొనుగోలు చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివా సులు ఆదేశించారు. ధాన్యం సేకరణపై గురువారం ఆయన అనంతపురంలోని తన నివాసంలో డిఎం రమేష్‌రెడ్డి, ప్రసాద్‌బాబు, డిటి సుబ్రహ్మణ్యంతో సమీక్ష నిర్వహించారు. రాయదుర్గం, శింగనమల నియోజకవర్గాల్లో 37,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించారన్నారు. బొమ్మనహాల్, కణేకల్లు మండలాల్లో అత్యధికంగా ధాన్యం ఇంకా రైతుల వద్దనే మిగిలిపోయిందన్నారు. ఇప్పటి వరకూ ప్రభుత్వం 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసిందని, దీంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బహిరంగ మార్కెట్ కంటే రూ. 200 నుంచి రూ. 250 వరకూ అధిక ధరకు కొనుగోలు చేయడంతో పాటు సేకరించిన ధాన్యానికి ప్రభుత్వం వెంటనే డబ్బులు చెల్లిస్తుండడం వల్ల రైతులు ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖకు అమ్మడానికి ముందుకొస్తున్నారన్నారు. రైతుల ఇబ్బందుల దృష్ట్యా ఎక్కువ మోతాదులో ధాన్యం సేకరించాల్సిన అవసరాన్ని ఇప్పటికే జిల్లా జాయింట్ కలెక్టర్‌కు చరవాణి ద్వారా తెలిపానని అధికారులకు గుర్తుచేశారు. అలాగే రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జిలానీకి ఫోన్ చేసి ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. స్పందించిన ఎండి మరికొంత ధాన్యం సేకరించడానికి వెంటనే చర్యలు తీసుకొంటామని విప్ కాలవకు హామీ ఇచ్చారు. ధాన్యం సేకరణలో ఎలాంటి అవరోధాలు లేకుండా చూడాలని కాలవ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులను కోరారు.



అధికారులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

'కౌలు రైతులను ఆదుకోవడంలో అధికారులు విఫలం'

బొమ్మనహాల్ : మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో గురువారం తహశీల్దార్ మునివేలు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కేవలం 6 అర్జీలు మాత్రమే అందాయి. రైతులు పెద్దగా హాజరు కాలేదు. దీనిపై కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు రంగారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మండ లంలో 5వేల మంది రైతులు కౌలుకు తీసుకుని భూములు సాగు చేస్తుంటే అధికారులు కేవలం 300 మందికి మాత్రమే కౌలు కార్డులు ఇచ్చారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కౌలు రైతు లకు రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, బ్యాంకు రుణాలు, తదితర ప్రయోజనాలను కల్పించాలని కోరారు. రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరిం చారు. సదస్సులో సర్పంచి ప్రమీలమ్మ, ఆర్ఐ బాలకృష్ణ, విఆర్ఒ రామన్న, సర్వేయర్ రవితేజ, కౌలు రైతుల సంఘం అధ్యక్షులు రంగారెడ్డి, టిడిపి నాయకుడు కేశప్ప, రైతులు పాల్గొన్నారు

అమిత్‌షాను తొలగించాలి : బీఎస్పీ

ప్రజాశక్తి-రాయదుర్గం



మాట్లాడుతున్న చిందనూరు నగేష్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను కించపరిచేలా పార్లమెంటులో వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు గద్దల నాగభూషణం, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిందనూరు నగేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధ్యతాయుత పదవిలో ఉన్న అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడటం తగదన్నారు. ఇప్పటికే బిజెపి పాలిత రాష్ట్రా ల్లో ఎస్సీలు, ఎస్టీ, బిసి, మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. అమిత్ షాకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టామన్నారు. ఇక నియోజకవర్గంలో జరుగు తున్న అవినీతి, అక్రమాలపై బీఎస్పీ ప్రజల తరపున పోరాడుతుందన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు నియోజకవర్గస్థాయిలో త్వరలో కొత్త కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. అంతకుముందు వారు అంబేద్కర్, జ్యోతిరావుపూలే, కాన్షీరామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ్మేపల్లి, మురడి, పల్లేపల్లి గ్రామాలకు చెందిన వ్యక్తులు బీఎస్పీలో చేరగా వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి కాసాని నాగరాజు, లక్ష్మీనారాయణ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరిప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అంకె కుళ్లాయప్ప పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన

రాయదుర్గం : బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే క్యాబినెట్ నుంచి తొలగించాలని యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సాయంత్రం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బిలాల్, అయూబ్, హేమాద్రి, విష్ణు, చరణ్, బొమ్మ లింగ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల నిరసనలు



అనంతపురం కార్పొరేషన్‌లో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ రంగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని గత ప్రభుత్వ హయాంలో 16 రోజుల పాటు చేసిన సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేసేలా అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నాడు అనంత కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఒకటవ నగర ప్రధాన కార్యదర్శి వై.వెంకట్ నారాయణ, మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారు ఎర్రిస్వామి, సాకే తిరుమలేశు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్, అవుట్సోర్సింగ్, ఇంజనీరింగ్, అదనపు మున్సిపల్ కార్మికులకు గత ప్రభుత్వ హయాంలో 16 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం పలు హామీలు ఇచ్చిందన్నారు. వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం కొనసాగిందన్నారు. కనీస వేతనం రూ.21వేలు, రెగ్యులర్ కార్మికులకు సరెండర్ లీవ్ అమౌంట్, జిపిఎఫ్ అకౌంట్‌ల ప్రారంభం, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఎక్స్‌గ్రేషియా తదితర సమస్యల పరిష్కారంపై హామీ ఇచ్చారన్నారు. వీటిపై ఎన్నికల సమయంలో టిడిపి నాయకులు కూడా హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి ఈ హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, నగర కోశాధికారి లక్ష్మీనరసమ్మ, కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, నాగేంద్ర, కుమార్, నల్లప్ప, జయరాం, నారాయణస్వామి తదితర కమిటీ సభ్యులు కార్మికులు పాల్గొనడం జరిగింది.

రాయదుర్గం : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సిపిఎం సీనియర్ నాయ కులు నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. నాగరాజు మాట్లాడుతూ నవంబర్ నెల వేతనం వెంటనే చెల్లించాలని, గతంలో చేపట్టిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మున్సిపల్ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన తిప్పేరుద్ర, ఇస్మాయిల్, తారానాయక్, పారిశుధ్య విభాగానికి చెందిన రాము, మల్లేష్, సిద్ధలింగ, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : సమ్మె సమయంలో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ యునియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి, అనంతరం కార్యాలయ మేనేజర్ అశ్వత్థనారాయణకు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏడాదైనా అమలు చేయడపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే రిటైర్మెంట్ బెనిపిట్స్, ఎక్స్‌గ్రేషియా, దహన సంస్కారాలకు ఆర్థికసాయం పెంపు, ఇంజినీరింగ్ కార్మికులకు జీవో-36 మేరకు వేతనం, శాశ్వత కార్మికులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంపు, పనిభారం తగ్గింపు, రక్షణ పరికరాలు అందజేత, తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిచో జనవరి 3వ తేదీ మున్సిపల్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శివ, వన్నూరుస్వామి నాయకులు తిమ్మప్ప, రమణ, శివకుమార్, వన్నూరుస్వామి, హనుమంతు, లక్ష్మీదేవి, దుర్గమ్మ, అలివేలమ్మ, ఎల్లక్క, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు జగదీష్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. పాలక ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన తెలిపామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సాకే నాగరాజు, మారుతీప్రసాద్, షబ్బీర్, దాసు, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలన్నారు. డెత్ బెనిఫిట్స్ తక్షణమే ఇవ్వాలన్నారు. సమ్మె కాలపు హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఘం కార్యదర్శి ఎన్.రామాంజనేయులు, సహాయ కార్యదర్శి కె.మహేష్, కోశాధికారి బాలరంగయ్య, టి.సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు

శింగనమల : కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం పర్యటనలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని నియోజకవర్గ వైసిపి నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, మండల పరిధిలోని సోదనపల్లికి చెందిన చాగంటి గురుమూర్తిరెడ్డి గురువారం మర్యాద రూపకంగా కలిశారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని సమస్యలపై జగన్‌తో చర్చించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారన్నారు.

తాడిపత్రి : పులివెందుల నియోజకవర్గ పర్యటనలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను వైసిపి రాష్ట్ర మైనారిటీ నాయకులు హీరాపురం ఫయాజ్‌బాషా గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాడిపత్రిలో జరుగుతున్న పరిణామాలపై మాజీ సీఎం ఆరాతీయగా తాడిపత్రి పరిస్థితులపై ఫయాజ్‌బాషా సుదీర్ఘంగా వివరించినట్లు తెలుస్తోంది. అనంతరం త్వరలోనే పార్టీకి మంచి కాలం రానుందని, కార్యకర్తలకు అండగా నిలవాలని సూచించినట్లు తెలుస్తోంది.

నేడు ప్రజావేదిక

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం ఉపాధి హామీ బహిరంగ సమీక్ష (ప్రజావేదిక) ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ గంగావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 మార్చి 1 నుంచి 2024 మార్చి 31వతేదీ వరకూ మండలంలోని వివిధ పంచాయతీల్లో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

యల్లనూరు ఎస్ఐగా రామిరెడ్డి



యల్లనూరు : మండల నూతన ఎస్ఐగా రామిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా బనగానపల్లి నుంచి బదిలీపై వచ్చిన ఆయన మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

గుత్తి : గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దార్ డి.ఓబులేసు తెలిపారు. గురువారం మండలంలోని బేతాపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులకు అర్జీలను అందజేశారు. ఈ సదస్సులో ఎంపిటిసి ఎం.ధనుంజయ, యంగన్నపల్లి, బేతాపల్లి సర్పంచులు పి.భరత్‌కుమార్, చిన్నఆంజనేయులు, తొండపాడు ఆలయ ఇఒ కురుబ నాగేంద్రుడు, విఆర్‌ఒలు పక్కీరప్ప, టి.సురేంద్ర, వెంకటరాముడు, రాజేష్, సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాదిక్‌వలి, టిడిపి నాయకులు రమేష్, నాగరాజు, శీనా, తదితరులు పాల్గొన్నారు.

నేడు కడవకల్లులో రెవెన్యూ సదస్సు

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శేషారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులో అర్జీలుసమర్పించి పరిష్కరించుకోవాలని కోరారు.

పకడ్బందీగా కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు

ఎస్పీ పి.జగదీష్



ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లాలోని పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు (స్టైపెండరీ) శారీరక దారుఢ్య పరీక్షలను ప్రణాళికాబద్ధంగా, సమర్ధవంతంగా నిర్వహిద్దామని ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్ హాలులో జిల్లాలోని పోలీసు అధికారులు, జిల్లా పోలీసు కార్యాలయం, ఐటికోర్ టీం సిబ్బందితో పరీక్షల నిర్వహణ, సిబ్బంది బాధ్యతలపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 30 నుంచి జనవరి 17వ తేదీ వరకూ నగరంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్, ఎఫిషియన్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు పురుష అభ్యర్థులు 5242, మహిళా అభ్యర్థులు 1237 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీఎస్ఎల్‌ఆర్బి) ఆదేశాలు, నియమ నిబంధనల మేరకు ఈ పరీక్షలు సవ్యంగా జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్సు కాపీలు వెంట తీసుకురావాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేష్, రవిబాబు, శ్రీనివాస్, రామకృష్ణుడు, నీలకంఠేశ్వర్‌రెడ్డి (ఏఆర్), జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి రఘురామ్‌నాయక్, సంబంధిత రిక్రూట్‌మెంట్ విభాగం క్లర్క్ నందకుమార్, సిఐలు కనుమూరి సాయినాథ్, జయపాల్‌రెడ్డి, షేక్ జాకీర్, ఆర్ఐలు రెడ్డెప్పరెడ్డి, మధు, పలువురు జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, ఐటి కోర్ టీం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే 'ఇదేం బాదుడు బాబు'

మేయర్ మహమ్మద్ వసీం



విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురంకార్పొరేషన్

విద్యుత్ ఛార్జీల పెంపుపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకే 'ఇదేం బాదుడు బాబు' కార్యక్రమం చేపట్టినట్లు మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. గురువారం నగరంలోని వైసిపి జిల్లాకార్యాలయంలో డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్య, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైపుల్లాబేగ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కరెండు ఛార్జీలు పెంచమని అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన ఆరునెలలోపే పేదలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపడం బాధాకమన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ తమ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో ఈనెల 27న నిరసన తెలపనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని పాతూరు బ్రహ్మంగారి ఆలయం నుంచి పవర్ ఆఫీస్ వరకూ ర్యాలీ నిర్వహించన్నుట్లు తెలిపారు. ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు నరసింహులు, సోనీ రమణ, ఇసాక్, రహంతుల్లా, శ్రీనివాసులు, రాజేశ్వరి, నాయకులు చింతకుంట మధు, కిషోర్, హబీబుల్లా, రవి, దాదాఖలందర్, గఫూర్, షేక్షావలి, రియాజ్, ఎ.1 రఫీ, హుస్సేన్‌పీరా, అన్సార్, ఖాదర్, జావీద్, శోభా, భారతి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ శింగనమలలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోపే విద్యుత్ ఛార్జీలు పెంచడం బాధాకరమన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఉద్యమాలను తీవ్ర ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పామిడి : మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, నైరుతీరెడ్డి పిలుపు మేరకు కరెంటు ఛార్జీల పెంపెపై నిరసన తెలపనున్నట్లు వైసిపి సీనియర్ నాయకులు చెన్నకేశవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం గుంతకల్లులో నిర్వహించనున్న నిరసనకు పామిడి మండలం నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందన

అనంతపురం రూరల్ : రైల్వే కోడూరులో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అభినందించారు. ఈమేరకు గురువారం నగరంలోని అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో క్రీడాకారులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం క్రీడాకారులు 30 బంగారు పతకాలు సాధించడంతోపాటు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవడం అభినందించదగ్గ విషయమన్నారు. త్వరలో జాతీయ స్థాయిలో రాష్ట్ర జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

ఐఒసి ఇడితో అనంత ఎంపి భేటీ



అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపి అంబికా

అనంతపురం రూరల్ : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్‌కుమార్‌తో అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ గురువారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అనంతపురం పార్లమెంట్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ముఖ్యంగా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి జూనియర్ డాక్టర్ల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించేందుకు సిఎస్ఆర్ నిధుల ద్వారా మొబైల్ హెల్త్ వాహనాన్ని ఏర్పాటు చేయాలని, గుంతకల్లు, అనంతపురం, గుత్తి, తాడిపత్రి రైల్వేస్టేషన్లలో వృద్ధులు, దివ్యాంగుల ప్రయాణ సౌకర్యార్థం బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేయాలని కోరారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

జిల్లావ్యాప్తంగా పోలీసుల అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు మత్తు పదార్థాల వాడటం కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా గంజాయి, తదితర మత్తు పదార్థాలు వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు గురించి వివరించారు. అంతేకాకుండా పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు-అనర్థాలు, ఈవ్ టీజింగ్, డయల్ - 100, రహదారి భద్రత, గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిఐ, ఎస్ఐలు వివరించారు.

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, వాడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాటాన్నరు. దీనికితోడు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ ఐరన్‌మాత్రలు వేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ నారాయణస్వామి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

చిన్నారులందరికీ ఐరన్ మాత్రలను వేయాలని జిల్లా రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ స్వామి సూచించారు. ఆర్‌బిఎస్‌కె కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని రోటరీపురం గ్రామంలో చేపట్టిన కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపిల్లాడికీ తప్పనిసరిగా ఐరన్‌మాత్రలు వేయాలన్నారు. తద్వారా చిన్నారుల్లో రక్తహీనత సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. అంతేగాకుండా చదువుపై శ్రద్ధ వహిస్తారన్నారు. అలాగే పిల్లలను పరీక్షించి ఐరన్ లోపాలున్న పిల్లలను ప్రభుత్వ ఆసుపత్రికి సిఫారసు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ టి.మోహన్‌బాబు, హెచ్ఇ వి.పర్వీన్, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు శ్రీదేవి, కేశవయ్య, ఆరోగ్య కార్యకర్త రాజేంద్ర ప్రసాద్, ఎఎన్ఎం రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే చేయాలి

ప్రజాశక్తి-గుమ్మగట్ట

మండల వ్యాప్తంగా ఆరోగ్య సమస్యలపై ఇంటింటి సర్వే చేపట్టాలని వైద్యులు బాలాజీనాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ ఆదేశాల మేరకు ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో 18ఏళ్ల పైబడిన వారందరికీ ముందస్తు క్యాన్సర్, బీపీ, షుగర్ పరీక్షలు చేయాలన్నారు. అలాగే అంగన్వాడీ, పాఠశాలల్లో పిల్లలందరికీ ఆరోగ్య పరీక్షలు పూర్తి చేయాలన్నారు. అవసరమైన వారికి టీకాలు వేయాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ మురళీధర్, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకు ఎస్పీ పరామర్శ



ఎస్ఐ ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

నగరంలోని కిమ్స్ సవీర ఆసుపత్రి ఐసియులో చికిత్స పొందుతున్న తాడిపత్రి అర్బన్ ఎస్ఐ నాగవీరయ్యను ఎస్పీ పి.జగదీష్ బుధవారం రాత్రి పరామర్శించారు. ఊపిరి ఆడక శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న నాగవీరయ్యను తాడిపత్రి ఆసుపత్రిలో చేర్పించి పోలీసులు చికిత్స చేయించారు. పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తాడిపత్రి నుంచి అనంతపురం కిమ్స్ సవీరా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ రాత్రి సవీరా ఆసుపత్రికి చేరుకుని నాగవీరయ్య ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో ఆరా తీసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అంతేకాకుండా ఎస్పై భార్యాపిల్లలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఎస్పీతో పాటు నాల్గవ పట్టణ సి.ఐ కనుమూరి సాయినాథ్ ఉన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-గుత్తి


బ్యుటీషన్ కోర్సులో శిక్షణ తీసుకున్న నిరుద్యోగ మహిళలకు ఐసిడిఎస్ సిడిపిఒ ఢిల్లేశ్వరి గురువారం సర్టిఫికెట్లను అందజేశారు. జన శిక్షణ సంస్థ సహకారంతో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల గుత్తిలో 20 మందికి ఉచితంగా 105 రోజులు బ్యూటిషన్ కోర్స్‌పై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధృవీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబాల దివస్

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని సుల్తాన్‌పేట అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో గురువారం వీర బాలదివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ సిక్కుల గురువు గురు గోవిందసింగ్ కుమారులు ఫతేసింగ్, జోరావర్ సింగ్ ధైర్య సాహసాలు, త్యాగాలను స్మరించుకుంటూ వీర బాల దివాస్ కార్యక్రమం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. దేశం, ధర్మం కోసం అతిచిన్న వయసులోనే తమ ప్రాణాలను తృణపాయంగా సమర్పించిన అమరులైన వీరపుత్రుల చరిత్రను పిల్లలకు తల్లులకు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునాలిని, అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లలు, కిషోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

బాలగొండ వీరనారప్పకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వీరనారప్ప

ప్రజాశక్తి-అనంతపురం

బాలగొండ వీరనారప్పకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పిహెచ్‌డి అవార్డును ప్రదానం చేసింది. ఈయన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో తెలుగు, తులనాత్మక సాహిత్య శాఖలో ఆచార్య ఎన్ఆర్ సదాశివరెడ్డి పర్యవేక్షణలో భాగవతంలోని 'మానవ సంబంధాలు-ప్రతిఫలనం' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్‌ను అందజేసింది. తక్కువ సమయంలో ఎంఫిల్, పిహెచ్‌డిలను పూర్తి చేసినందుకు వీరనారప్పను పలువురు అభినందించారు.

పొలం పిలుస్తోంది

పుట్లూరు : మండలంలో చింతకుంట, పుట్లూరు గ్రామాల్లో ఎఒ కాత్యాయని ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పప్పుశనగ పంటను పరిశీలించి చీడపీడలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ హరి, విహెచ్ఎ మురళి పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదుకు విరాళం

అనంతపురం రూరల్ : టిడిపి సభ్యత్వాల నమోదు కోసం రజక కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నాగేశ్వరరావు రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఈమేరకు గురువారం స్థానిక అర్బన్ టిడిపి కార్యాలయంలో టిడిపి నేత దగ్గుపాటి రాజాకు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్టు

ద్విచక్ర వాహనాలు స్వాధీనం



దొంగల వివరాలను వెల్లడిస్తున్న గుంతకల్లు డీఎస్పీ ఎ.శ్రీనివాస్

గుంతకల్లు : చెడు వ్యసనాలకు బానిసలై దొంగతనాలను వృత్తిగా ఎంచుకుని ఇళ్లల్లో చోరీలకు పాల్పడటమే కాకుండా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగలు రఘు, షేక్ మస్తాన్‌వలిని అరెస్టు చేసి 14 ద్విచక్ర వాహనాలు, 27 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు గురువారం కసాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగలకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వెల్లడించారు. పట్టణానికి చెందిన రఘు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈనేపథ్యంలో మెకానిక్‌గా పని చేస్తున్న షేక్ మస్తాన్‌వలితో కలిసి ఇళ్ల ముందు ఉంచిన ద్విచక్ర వాహనాలను దొంగతనాలు చేసేవారు. ఇందులో భాగంగానే కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో కూడా ద్విచక్ర వాహనాలు చోరీ చేశారు. చోరీల నియంత్రణపై ఎస్పీ ఆదేశాల మేరకు గట్టి నివాసి ఉంచామన్నారు. రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకటస్వామి తన బృందంతో నిఘా పెట్టారన్నారు. పక్కాగా రాబడిన సమాచారం మేరకు నిందితుడు రఘును శంకరానంద గిరి స్వామి కళాశాల వెనుక, షేక్ మస్తాన్ వలిని కసాపురం వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. దొంగల నుంచి 14 ద్విచక్ర వాహనాలు, 27 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన ఇద్దరినీ కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

రాయదుర్గం : అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి అతడి నుంచి 12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తెలిపారు. పట్టణంలోని రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాయదుర్గం పోలీస్ సర్కిల్ పరిధిలో తరచూ ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు అందడంతో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు బొమ్మనహాల్ ఎస్ఐ నబిరసూల్, సిబ్బందితో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆ బృందం గురువారం మధ్యాహ్నం బొమ్మనహాల్ మండలంలోని నేమకల్లు క్రాస్ వద్ద గస్తీ చేపట్టారు. ఈ క్రమంలో బైక్‌పై వస్తున్న వడ్డే సురేష్‌ను ఆపి రికార్డులు పరిశీలించగా అతడు చోరీ చేసిన వాహనం పై వెళ్తున్నట్లు తెలిసిందన్నారు. ఆ తర్వాత అతడిని విచారణ చేపట్టగా బొమ్మనహాల్, కణేకల్లు, రాయ దుర్గం టౌన్, కర్నాటకలోని బళ్లారి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 12 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు తేలిందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. సమావేశంలో రాయ దుర్గం సిఐలు వెంకటరమణ, జయనాయక్, బొమ్మనహాల్, రాయదుర్గం ఎస్ఐలు నబిరసూల్, బాలరాజు పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌సిలో గుర్తుతెలియని శవం

బొమ్మనహాల్ : మండలంలోని హెచ్‌ఎల్‌సి ప్రధాన కాలువలో 105వ కిలోమీటర్ల వద్ద ఓ గుర్తు తెలియని శవం కల్వర్టుకు తగులుకొని ఆగిపోయింది. శవం రోజులుగా ఇక్కడే ఉందని పశువులు, గొర్రెల కాపరులు పేర్కొంటున్నారు. శవాన్ని బయటకు తీయడానికి అటు కర్నాటక, ఇటు ఆంధ్ర అధికారులెవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆ శవాన్ని తొలగించాలని ప్రజలు, పశువులు, గొర్రెల కాపరులు, రైతులు, రైతు కూలీలు కోరుతున్నారు.

బైక్‌కు నిప్పు

బొమ్మనహాల్ : మండలంలోని చంద్రగిరి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ద్విచక్ర వాహనం పూర్తిగా కాలిపోయింది. వివరాలు.. గ్రామానికి చెందిన చంద్ర బుధవారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు ఉంచాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ఆ వాహనానికి నిప్పు పెట్టి వెళ్లిపోయారు. గమనించిన చంద్ర వచ్చి చూసే లోపే ఆ వాహనం పూర్తిగా కాలిపోయింది. బాధితుడు చంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నబి రసూల్ తెలిపారు.

మిలిటరీ మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం : నగరంలో దాడులు నిర్వహించి డిఫెన్స్ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎం.సత్యనారాయణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు డిఫెన్స్ మద్యంపై దాడులు నిర్వహించి నగరానికి చెందిన ఎస్.వెంకట్ ను అరెస్టు చేసి 69 ఫుల్ బాటిళ్ల డిఫెన్స్ లిక్కర్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాబోయే పండుగలకు సరఫరా చేసేందుకు ఈ మద్యం బాటిళ్లు తెప్పించినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిపారు. ఈ మద్యం బాటిళ్లు ఎక్కడి నుండి వచ్చాయి అనే దానిపై విచారణ చేస్తున్నామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు జయ నరసింహ, జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ విజయ భాస్కర్, శివప్రసాద్ మరియు కానిస్టేబుల్ నరసింహ నాయక్, ఎర్రి స్వామి, వీరనారపురెడ్డి పాల్గొన్నారు.